ప్రజాశక్తి
బుధవారం 11 డిసెంబర్ 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





భారీ వర్షాల నేపథ్యంలో

వరి కోతలు నిలిపేయాలి

కలెక్టర్ జె.వెంకటమురళి



కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో రానున్న మూడు రోజుల పాటు వరి పంట కోతలు నిలిపివేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి రైతులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. ఈ మూడు రోజులలో వరి కోత యంత్రాలు నడపరాదని, ఎవరైనా యంత్రాలు నడిపితే వాటిని అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి పంటనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేస్తారన్నారు. 14వ తేదీన టీసీలకు ఎన్నికలు జరుగుతాయని, 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీకి ఎన్నికలు నిర్వహించాలన్నారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా విడుదల కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే విచారణ పూర్తి చేయాలన్నారు. ఆధార్ కార్డులు లేనివారు 2,850 మందిని గుర్తించగా, ప్రత్యేక డ్రైవ్ ద్వారా 1,970 మందికి ఆధార్ ఇవ్వడం జరిగిందని, మిగిలినవి త్వరలో పూర్తి చేయాలన్నారు. ఆధార్ కార్డులు వచ్చిన వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వర్తింపజేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, భూ వివాదాలు లేని గ్రామంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారో, ఆ గ్రామంలోనే రాజకీయ నాయకులు, రైతు సంఘాలు, రైతుఉత్పత్తి సంఘాలు, ఎన్జీవోలను కలుపుకొని ముందస్తుగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఆర్ఎస్ఆర్, వెబ్‌ల్యాండ్ రికార్డ్స్, అడంగల్, వన్ బి, ఆర్ఎస్ఏ, బేసిక్ రికార్డులను ఖచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో జనవరి 8వ తేదీ వరకు సమర్థవంతంగా సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామానికి సంబంధించిన మ్యాప్‌లు ప్రతి గ్రామంలో ప్రచార బోర్డులలో ప్రదర్శనగా ఉంచాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల దస్త్రాలన్నీ అధికారులు పున:పరిశీలన

▶ 2లో

జిల్లా సమగ్రాభివృద్ధికి

రూ.10 వేల కోట్లు కేటాయించాలి

- చీమకుర్తిలో పార్టీ జిల్లా మహాసభలు
- ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహణ
- హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- మహాసభలను జయప్రదం చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్



మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్ల ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. చీమకుర్తిలో సిపిఎం జిల్లా మహాసభలు ఈ నెల 13, 14, 15 తేదీలలో జరుగుతాయని, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఒంగోలు, సుందరయ్య భవన్‌లో మంగళవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో సిపిఎం జిల్లా మహాసభల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పోరాటానికి సిపిఎం ఎల్లప్పుడూ ముందు ఉంటుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు నిర్వహించే జిల్లా మహాసభలను గెలాక్సీ సిటీ చీమకుర్తిలో ఈ నెల 13, 14, 15 తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు. గడిచిన కాలంలో పార్టీ సాధించిన ఫలితాలు, భవిష్యత్తు కార్యాచరణను మహాసభలలో ప్రకటిస్తామన్నారు. ఈ నెల 13న మధ్యాహ్నం చీమకుర్తి ఆర్టీసి బస్టాండ్ నుంచి ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందన్నారు. సిపిఎం జిల్లా మహాసభల ప్రారంభ బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కారుసాల సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు పాల్గొంటారన్నారు. ఈ నెల 14, 15 తేదీలలో జరిగే ప్రతినిధుల సభలో జిల్లాలో ప్రధాన సమస్యలపై చర్చలు జరుగుతాయన్నారు. నీటి వనరులైన వెలిగొండ ప్రాజెక్ట్, గుండ్లకమ్మ ప్రాజెక్ట్, సంగమేశ్వర ప్రాజెక్ట్, పాలేటిపాడు ప్రాజెక్ట్‌లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించాలని, ఇందుకు ముఖ్యమంత్రిపై జిల్లా ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చి నిధులు సాధించాలని కోరారు. పారిశ్రామికీకరణకు అనుగుణంగా పరిశ్రమలు స్థాపించాలని,

▶ 2లో

అన్నం పెట్టే భూమికి

ఏ సమస్యా ఉండకూడదు..

- ప్రజల భూమికి శాశ్వత హక్కుల కోసం ప్రభుత్వం చర్యలు..
- రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా



మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా

ప్రజాశక్తి-పర్చూరు, బాపట్ల జిల్లా

'భూమి ఒక తల్లి లాంటిది, జీవితాంతం మనకు అన్నం పెట్టే ఆ భూమికి ఏ సమస్యలూ ఉండకూడదు' అని రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా అన్నారు. పర్చూరు మండలం, తన్నీరువారిపాలెంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ దస్త్రాలు, అడంగల్లు, ఆర్ఎస్ఆర్‌లను ఆయన పరిశీలించారు. గ్రామకంఠం భూమి వివరాలపై ఆరా తీశారు. రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలతో ఆయన నేరుగా మాట్లాడారు. ఈ ప్రాంతంలో భూ సమస్యలు ఉన్నాయా.? అంటూ ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు మారుమూల ప్రాంతంగా ఉన్న ఈ గ్రామంలో అధికారులు పర్యటించినప్పుడే సమస్యలు పూర్తిగా తగ్గిపోతాయని అధికారులకు సూచించారు. అడంగల్ కావాలని అర్జీలు పెట్టుకున్న తన్నీరు అమ్మయ్య, అడ్డగడ్డ జాన్ బాబు, టి రంగారావు, అడ్డగడ్డ శ్రీనివాసరావులకు వన్‌బి అడంగల్‌ను తక్షణమే సిసోడియ చేతుల మీదుగా ఉచితంగా అందజేశారు. అనంతరం ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లోకి వెళ్తే సమస్యలు పూర్తిగా తగ్గిపోతాయన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములలో లబ్ధిదారులే ఉన్నారా, ఆక్రమణలకు గురైందా.? అనే విషయాలను గుర్తిస్తున్నామన్నారు. రీ సర్వేలో సమస్యలు వచ్చాయన్నారు. నిషేధిత భూముల జాబితాలోనివి, తొలగించిన వివరాలు తారుమారయ్యాయని, దీంతో సమస్యలు అధికమయ్యాయన్నారు. వాటన్నింటినీ పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. పూర్వకాలంలో చేసిన సర్వేలు, 2017 సంవత్సరంలోనూ నిర్వహించిన రెవెన్యూ సదస్సులతో ప్రజల భూములకు హక్కులు కల్పించినట్లు వివరించారు. ప్రస్తుతం పరిపాలన వ్యవస్థ బాగుందని, దీంతో సమస్యలన్నీ తీరిపోతాయని చెప్పారు. మారుమూల ప్రాంతమైన తన్నీరువారిపాలెం గ్రామంలోని సదస్సులో పాల్గొనడం సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ గ్రామంలో త్వరలోనే రీ సర్వే చేస్తామన్నారు. భూములకు సంబంధించిన కొత్త పాస్ పుస్తకాలు అవసరమైన వారికి అందచేస్తామన్నారు. కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ రెవెన్యూ, భూ సమస్యల రహిత గ్రామంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భూ వివాదాలు లేని గ్రామాలుగా రెవెన్యూ గ్రామాలను తీర్చి దిద్దుతున్నట్లు చెప్పారు. ఈ నెల 6 నుంచి ప్రారంభమైన రెవిన్యూ సదస్సులు జనవరి 8వ తేదీ వరకు జిల్లాలోని 277 రెవెన్యూ

▶ 2లో



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వ మెడికల్ కళాశాల

నిర్మాణ పనులు ప్రారంభించాలి

8పేజీ ▲

జమ్మూకాశ్మీర్‌లో

ల్యాండ్‌మైన్ పేలి జవాన్ మృతి



వెంకటసుబ్బయ్య (ఫైల్)

ప్రజాశక్తి-కంభం

ల్యాండ్ మైన్ పేలడంతో కంభంకు చెందిన జవాన్ జమ్మూకాశ్మీర్‌లో మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. కంభం మండలం, రావిపాడు గ్రామానికి చెందిన వరికుంట్ల వెంకట సుబ్బయ్య(38)కు, అనంతపురం జిల్లా, నార్పల మండల కేంద్రంలో గవ్వలవీధికి చెందిన గవ్వల లీలావతితో పదేళ్ల క్రితం వివాహమైంది. వెంకటసుబ్బయ్య 25వ రాష్ట్రీయ రైఫిల్స్ హవల్దారుగా జమ్మూకాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కొద్దికాలం భార్యాపిల్లలతో విధులు నిర్వహించే ప్రాంతంలోనే నివాసం ఉన్నారు. పిల్లల చదువు కోసం కుటుంబాన్ని నార్పలలోనే పెట్టి జమ్మూకాశ్మీర్లో విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం విధులు నిర్వహించే సమయంలో ల్యాండ్‌మైన్ పేలి సుబ్బయ్య వీరమరణం పొందినట్లు కుటుంబసభ్యులకు తెలిసింది. సుబ్బయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- ఇంకొల్లు

మండల పరిధిలోని భీమవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ వేణుగోపాల్ మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 15 వరకూ గడువు ఉన్నట్లు తెలిపారు. శనగకు ఎకరాకు రూ.84, మొక్కజొన్నకు రూ.105, వరికి ఎకరాకు రూ.126 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పశువర్ధక సహాయకులు , గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నగరం : మండల పరిధిలోని ఈదుపల్లి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ రమేష్ బాబు రైతులతో కలసి పంటలను పరిశీలించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె. నాగ శ్రీనివాసరావు, గ్రామ గ్రామ వ్యవసాయ సహాయకులు నర్రా కిర్మణయి యాదవ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు : పంట బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 15 వరకూ గడువుఉన్నట్లు మార్టూరు సబ్ డివిజన్ ఎడిఎ కెవి.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని వలపర్ల, కోలలపూడి గ్రామాలలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. అనంతరం మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ మొక్కజొన్నలో జింకు లోపధాతు నివారణకు జింక్‌ను పిచికారీ చేయాలన్నారు. కత్తెర పురుగు నివారణకు ఎకరాకు ప్రొక్లేయిమ్ 80 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పిచికారీ చేయాలన్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు కోయవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ కిరణ్ కుమార్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కారంచేడు : మండల పరిధిలోని కొడవాలివారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ సుధీర్‌బాబు మాట్లాడుతూ రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు దుర్గారావు, శారద ,బిందు మాధురి, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండల పరిధిలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మేరిమ్మ మాట్లాడుతూ ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకం గురించి రైతులకు వివరించారు.బీమా వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. శనగ పంటకు ఆశించే ఎండు తెగులు, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది సుదర్శన్, రాము, రైతులు పాల్గొన్నారు.



యద్దనపూడిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



నగరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

(మొదటిపేజీ తరువాయి)

కనిగిరి నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక కారిడార్ సాధనకు పోరాటాలు చేస్తామన్నారు. ప్రస్తుతం గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో ఉందని, ఆక్వా రంగం కుదేలైందన్నారు. ప్రభుత్వ విధానాలతో చిన్న పరిశ్రమలు దివాళా తీసే పరిస్థితులు ఏర్పడ్డాయని, గ్రానైట్, ఆక్వారంగం, పరిశ్రమల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రకాశం జిల్లా ఏర్పడి 52 సంవత్సరాలు పూర్తయినా నేటికి అభివృద్ధికి నోచుకోలేదని, పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని పట్టించుకోవట్లేదన్నారు. వలసలు తీవ్రమయ్యాయమని, వాటిని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని, మార్కాపురం వైద్యకళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని ప్రధాన సమస్యలపై మహాసభలలో సుదీర్ఘంగా చర్చిస్తామని, మహాసభలలో పార్టీ శ్రేషులు, ప్రజలు, సానుభూతిపరులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో సౌర విద్యుత్ అందించేందుకు గౌతమ్ అదానీతో చేసుకున్న సెకి ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. 1 యూనిట్ రూ.2.49లకు 25 సంవత్సరాలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారన్నారు. విద్యుత్ ఒప్పందంతో ప్రమాదం ఉందని, పరిశ్రమలు, ప్రజలు వీటిని వ్యతిరేకించాలన్నారు. స్మార్ట్ మీటర్లు వ్యాపార సంస్థలకు ఏర్పాటు చేస్తున్నారని, తరువాత వినియోగ దారుల ఇళ్ళకు బిగిస్తారన్నారు. విద్యుత్ నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే ముసుగులో ఈవిధంగా చేస్తున్నారని, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇచ్చే విద్యుత్ రాయితీ 200 యూనిట్లకు మంగళం పాడతారన్నారు. వ్యవసాయ మోటార్లకు ముందుగానే డబ్బులు చెల్లిస్తేనే విద్యుత్‌ను సరఫరా చేస్తారన్నారు. ఇటువంటి ప్రభుత్వ ప్రయత్నాలను ప్రజలు వ్యతిరేకించాలని, వినియోగదార్ల సంఘాలుగా ఏర్పడి పోరాటం చేయాలన్నారు. భవిష్యత్తులో జరిగే పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చినా అంతంత మాత్రంగా నిధులు కేటాయింపులు ఉన్నాయని, సిఎంపై జిల్లా ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీలలో జరిగే ప్రతినిధుల సభలో 170 మంది పాల్గొంటారన్నారు. 2021లో జిల్లా మహాసభలు జరిగాయని, జిల్లాలో రాజకీయాలలో మార్పు జరిగిందన్నారు. దేశంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉందని, ప్రకాశం జిల్లాకు పరిశ్రమలు, అభివృద్ధి నిధులు ఇవ్వాలన్నారు. జిల్లాలో 180 పాఠశాలలు మూతపడ్డాయని, 1000 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయాలన్నారు. ప్రజలకు ఉపయోగ పడే విధంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె మాబు మాట్లాడుతూ ప్రజా పోరాటాలకు వేదిక అయిన సంతనూతలపాడు నియోజకవర్గంలో సిపిఎం మహాసభలు జరుగు తున్నాయన్నారు. పొగాకు రైతులు, మంచినీరు. వ్యవసాయ భూముల కోసం సిపిఎం పోరాటాలు చేసిందన్నారు. చీమకుర్తిలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నం పెట్టే భూమికి ఏ సమస్యా ఉండకూడదు..

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాలు, 456 పంచాయతీలలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 37 ప్రాంతాలలో సదస్సులు జరగ్గా 457 అర్జీలు నమోదయ్యాయన్నారు. అందులో 390 రెవెన్యూకు సంబంధించిన అర్జీలు కాగా, మిగిలిన 67 అర్జీలు ఇతర శాఖలకు సంబంధించినవని వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసి. లవన్న, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ విజయమ్మ, తహశీల్దార్ బ్రహ్మయ్య, సర్పంచి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

భారీవర్షాల నేపథ్యంలో వరి కోతలు నిలిపేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిషేధిత భూముల జాబితా నుంచి 3,034 ఎకరాలు తొలగించగా ఇప్పటివరకు 2,500 ఎకరాలను పరిశీలించినట్లు కలెక్టర్ చెప్పారు. మూడు రోజుల్లో పరిశీలన ప్రక్రియ ముగించాలన్నారు. చుక్కల భూమి 4,981 ఎకరాలు ఉండగా, పరిశీలన ప్రక్రియ సత్వరమే చేపట్టాలన్నారు. రీసర్వే సదస్సుల్లో వచ్చిన పీజీఆర్ఎస్ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని చెప్పారు.

నీటి తీరువా పన్నులు లక్ష్యం మేరకు వసూలు చేయాలని కలెక్టర్ కోరారు. భూమి సాగుదారుల నుంచి రూ.13.45 కోట్లు డిమాండ్ ఉండగా వసూళ్లపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. వీఆర్వోల ద్వారా వసూలు ప్రక్రియ వేగంగా చేపట్టాలని, ఇందుకోసం తహశీల్దార్లు రైతులను చైతన్యపరచాలన్నారు. ఆర్డీవోల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని ఆదేశించారు. అభివద్ధిని కాంక్షిస్తూ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములు కేటాయించిన వాటిని పరిశీలించాలన్నారు. ఏ ఉద్దేశంతో కేటాయింపులు జరిగాయో, క్షేత్రస్థాయిలో వాటి వినియోగంపై నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు భూమిని తిరిగి తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా 35 సినిమా థియేటర్లు ఉండగా, కేవలం 16 థియేటర్లకే లైసెన్స్ కలిగి ఉన్నాయని తక్షణమే నోటీసులు జారీచేయాలని ఆదేశించారు.

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పట్టణానికి చెందిన షేక్ ఫాతిమా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం వైద్యశాలకు వెళ్లింది. ఆమెను పరీక్షించిన వైద్యులు రక్తం అవసరమని తెలిపారు. వెంటనే బి నెగటివ్ రక్తం ఎక్కించాలని తెలిపారు. ఈ విషయం గురించి తెలుసుకున్న రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ చుండూరి మురళీ సుధాకరరావు అద్దంకికి చెందిన పొన్నూరి సాయి సురేష్ ద్వారా బి నెగిటివ్ రక్తాన్ని సోమవారం అందజేశారు. 8వ సారి రక్తదానం చేసిన సురేష్, 436వ సారి రక్తదానాన్ని ప్రోత్సహించిన చుండూరి మురళీ సుధాకరరావును రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రక్తం అందజేస్తున్న దాతలు

హితేష్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-మార్టూరు : మండల పరిధిలోని ఇసుక దర్శి గ్రామానికి చెందిన కర్పూరపు హితేష్ కరాటే పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. పల్నాడు జిల్లా చిలుకలూరిపేటలో బిఆర్.అంబేద్కర్ మెమోరియల్ జాతీయ స్థాయి కరాటే పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో హితేష్ పాల్గొని ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. హితేష్ ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్నాడు. బంగారు పతకం సాధించిన హితేష్‌ను కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్, కరాటే మాస్టర్ దేవరకొండ వెంకటేష్, తల్లిదండ్రులు కర్పూరపు శివపార్వతి, అనీల్ కుమార్, ఇసుక దర్శి గ్రామస్తులు అభినందించారు.

వంటపాత్రలు అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు : పోతకమూరి పాపయ్య 25వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు సహృదయ సేవా సంఘం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన వస్తువులు, కుర్చీలు, వంట పాత్రలు మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని చింతమోటు , కొల్లూరు మండలం జువ్వలపాలెంలోని 6 అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి అందజేశారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలకు 10 కుర్చీలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సహృదయ సేవా సంఘం సభ్యులు డేవిడ్, రవి ,రాఘవులు, పచ్చి గళ్ళ వెంకటరత్నం, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కోలభీమునిపాడులో తహశీల్దార్ కె.చిరంజీవి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. ఎక్కడ చూసినా భూకబ్జాలు దోపిడీలు పెరిగిపోయాయని తెలిపారు. గత ఐదు సంవత్సరాల్లో భూకబ్జాలకు పాల్పడిన వారి భరతం పడతామని నిందితులకు కఠిన శిక్షలు ఉంటాయని అన్నారు. త్వరలోనే ప్రజలకు నూతన రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు.

మద్దిపాడు: మండల పరిధిలోని పెద్దకొత్తపల్లిలో మంగళవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుకు 50 ఫిర్యాదులు వచ్చినట్లు తహశీల్దార్ సుజన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి డీఆర్‌డీఏ పీడీ వసుంధర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రేషన్ కార్డులకు 2, ఇళ్లకు 6, మ్యుటేషన్స్ 32, సర్వేకు 6, అగ్రికల్చర్ ల్యాండ్ పట్టా 1, 22 ఏ డిలేషన్స్ 3 మొత్తం 50 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పలు సమస్యలపై పిఎస్ఆర్ తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మండవ జయంత్ బాబు, సర్పంచ్ శైలజ, అయ్యన్న, నల్లూరి శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కందుల

గిద్దలూరు రూరల్ : గిద్దలూరు మండలం చెట్టిరెడ్డిపల్లి, కొండపేట గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ అధికారులు గ్రామ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఎక్కువ శాతం నివాస స్థలాలు కావాలంటూ తహశీల్దార్‌కు అర్జీలు అందజేశారు. రేషన్ కార్డుల కోసం 30 అర్జీలు, భూ సమస్యలపై 30 అర్జీలు వచ్చినట్లు గ్రామ రెవెన్యూ అధికారి లక్ష్మీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ఆంజనేయ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు, డిప్యూటీ తహశీల్దార్ ఏ.నాయబ్ హుస్సేన్, వీఆర్వోలు, ప్రజలు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్, కొత్తపాసు పుస్తకాలు తదితర సమస్యలకు సంబంధించి 39 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వాసుదేవరావు, వీఆర్వోలు భవాణి, ఏసోబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండల కేంద్రమైన పెద్దారవీడులో మంగళవారం తహశీల్దార్ శైలేంద్రకుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న భూ విస్తీర్ణాలు, దేవాదాయ భూములు, ప్రభుత్వ భూములు గురించి వివరించారు. గ్రామసభల ద్వారా భూ సమస్యలు పరిష్కరించేందుకు వీలు కలుగుతుందన్నారు. రైతులు అనేక సమస్యలపై అర్జీ రూపంలో అధికారులకు అందజేశారు. భూ సమస్యలపై 28 అర్జీలు వచ్చినట్టు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ గోపి, విఆర్‌వొ కష్ణ, మండల సర్వే గోపాల్‌రెడ్డి, గొట్టం శ్రీనివాసరెడ్డి, గొట్టం రాంనారాయణరెడ్డి, గొట్టం రామకష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండలంలోని వై.చెర్లోపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ చాంద్ బాషా, టిడి సాలమ్మ, ఆర్‌ఐ ప్రసాద్, సర్వేయర్ సురేష్, వీఆర్వో చెన్నయ్య, టిడిపి నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరు గ్రామంలో గల పోలేరమ్మ గుడిలో హుండీ దొంగతనం చేసిన పూరిమెట్ల నారాయణకు అద్దంకి కోర్టు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు రేణింగవరం ఎస్‌ఐ వినోద్ బాబు తెలిపారు. ఈ కేసులో ఎస్‌ఐ వినోద్ బాబు వివిధ ప్రాంతాల్లో గాలించి మంగళవారం ఉదయం 8 గంటలకు అలవలపాడు అడ్డరోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయి నారాయణను విచారించగా గతంలో సుమారు నాలుగు దొంగతనం కేసులు తనపై ఉన్నట్లు నేరం ఒప్పుకున్నాడని, వెంటనే అతనిని అద్దంకి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ వినోద్ బాబు తెలిపారు.


ఉచిత న్యాయ సహాయ ఫ్లెక్సీ వద్ద బార్ అసోసియేషన్ ప్రతినిధులు

టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

ప్రజలకు న్యాయ సహాయం కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని చీరాల బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది విజయ రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ, చీరాల ఆధ్వర్యంలో చిన్నగంజాం తహసీల్దార్ కార్యాలయం వద్ద, పోలీస్ స్టేషన్ వద్ద న్యాయ సహాయ టోల్ ఫ్రీ నెంబర్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత న్యాయసహాయ సేవలు ఉపయోగించుకొనుటకు టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ డిస్‌ప్లే ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు పిఎల్‌వీలు, ఎస్‌ఎం సుభాని, లోక్ అదాలత్ ఇన్‌ఛార్జి వి.రాఘవులు, చినగంజం డిప్యూటీ తహశీల్దార్, ఎస్‌ఐ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మహాసభలను జయప్రదం చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కొండపి

చీమకుర్తిలో డిసెంబర్ 13 నుంచి 15 వరకు జరిగే సిపిఎం ప్రకాశం జిల్లా 14వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. మహాసభకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం కొండపి మండలంలోని పెరిదేపిలో ఇంటింటికీ తిరిగి పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు చీమకుర్తి తరలిరావాలని కోరారు. ఈ మహాసభల్లో గడచిన మూడేళ్ల కాలంలో జిల్లాలో సిపిఎం నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలను సమగ్రంగా సమీక్షిస్తామన్నారు. భవిష్యత్తులో జిల్లా సమగ్ర అభివద్ధి కోసం చేపట్టబోయే కార్యక్రమాలకు, ఉద్యమాలకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. సిపిఎం జిల్లా నాయకులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ 13వ తేదీ చీమకుర్తికి కొండపి ప్రాంతం నుంచి ప్రజా సమీకరణ చేస్తున్నామని, ఈ ప్రాంత ప్రజా సమస్యలను కూడా మహాసభలో చర్చిస్తామని భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, నాయకులు ఎం.చిన్న పేతురు, అంగలకుర్తి బ్రహ్మయ్య, లక్కపోగు పరిశుద్ధం, ఏ.విశ్రాంతి, ఎల్.దావీదు, ఏ.మాధవి, సిహెచ్ సునంద, ఎం.సంపూర్ణ, ఏ.బాబురావు, సాల్మన్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

జిల్లా వ్యాప్తంగా పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక తర్లుపాడు రోడ్డులోని విద్యుత్ శాఖ వసతి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఈ మాట్లాడారు. విద్యుత్ బకాయిలకు సంబంధించి ప్రభుత్వ శాఖలలో రూ.650 కోట్లు, ప్రైవేటు బకాయిలు రూ.350 కోట్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ శాఖల బకాయిల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. జిల్లాకు ప్రధాన మంత్రి సూర్యఘర్ కింద 8 వేల కనెక్షన్లు మంజూరయ్యాయని, 300 యూనిట్లు ఆపైన వినియోగదారులకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

8 సబ్ స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు

జిల్లా వ్యాప్తంగా 8 సబ్ స్టేషన్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినట్లు ఎస్‌ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఒంగోలులోని హౌసింగ్ కాలనీ, రాజీవ్‌నగర్, క్లోపేట, గిద్దలూరు నియోజకవర్గంలోని కాసనపల్లి, కొండేపి నియోజకవర్గంలోని తూర్పునాయుడుపాలెం, దర్శి నియోజకవర్గంలోని కల్లూరు, పొదిలి మండలంలోని ఏలూరు, కందుకూరు నియోజకవర్గంలోని మన్నేటికోట తదితర ప్రాంతాల్లో 33/11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఏర్పాటు చేస్తామని అన్నారు. మార్కాపురం డివిజన్లో విద్యుత్ బకాయిల పెండింగులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించామన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా లైన్మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు, ఏఈలు ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, నివారణ, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్ అయితే ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, అంతరాయం తొలగించాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ నాగేశ్వరరావు, డిఈ షియానాయక్, ఎఈ నాగేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్


మృతి చెందిన యశ్విన్

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని రాయవరం రైల్వే వంతెనపై మంగళవారం చోటుచేసుకుంది. అందిన వివరముల ప్రకారం.. పట్టణానికి కార్తీక్, యశ్విన్‌లు అన్నదమ్ములు. అన్నయ్యను రైలు ఎక్కించడానికి ఇద్దరూ కలిసి బైక్‌పై మార్కాపురం రైల్వే స్టేషన్‌కు బయలు దేరారు. ఈ క్రమంలో సరిగ్గా ప్రమాద స్థలి వద్దకు రాగానే మంచు కురుస్తుండటంతో రహదారి కనిపించక ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో వెనక కూర్చున్న యశ్విన్ (16) అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న కార్తీక్ స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఆటోలో మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఘటన గురించి సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.అంకమ్మరావు తెలిపారు. పెద్ద కుమారుడిని రైలెక్కించేందుకు వెళ్లి చిన్న కుమారుడు ఇలా అర్ధాంతరంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో యశ్విన్ తల్లిదండ్రుల రోదనలను మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు


గాయపడిన సాయినందకిషోర్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన మంగళవారం నిడమానూరు సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణానికి చెందిన సాయినందకిషోర్ ఒంగోలులో కంప్యూటర్ కోర్సు నేర్చుకోవడానికి నిడమానూరులో తన మేనమామ అయిన సుబ్బారావు ఇంటిలో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనంపై మంగళవారం ఉదయం ఒంగోలు వెళ్తుండగా రోడ్డుపై కంకర వేసి వదిలేయడంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. సాయినందకిషోర్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఒంగోలు వైద్యశాలకు తరలించారు. కాగా నిడమానూరు-నాగులుప్పలపాడు మధ్య రోడ్డు పనుల్లో భాగంగా రహదారిపై కంకర పరిచారు. తారు వేయకపోవడంతో కంకర వల్ల బైక్ అదుపు తప్పిందని స్థానికులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి కురిచేడు

ఫ్యానుకి ఉరివేసుకొని వివాహిత మృతి చెందిన సంఘటన కురిచేడు మండలం, దేకనకొండ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేకనకొండ గ్రామానికి చెందిన కోలుకొండ సుజాత కుటుంబ కలహాల నేపథ్యంలో తన ఇంట్లోనే ఫ్యానుకి ఉరి వేసుకొని మృతి చెందింది. మృతురాలికి ఒక కూతరు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దర్శి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ బి. శివ తెలిపారు.

చెప్పుల దుకాణం దగ్ధం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరులోని కొండపి రోడ్డులో కంచర్ల వైద్యశాల పక్కన ఉన్న చెప్పుల దుకాణం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. మంగళవారం సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. టంగుటూరు గ్రామానికి చెందిన పసుమర్తి కోటేశ్వరరావు చెప్పుల షాపుతో జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో మంటలంటుకొని దగ్ధమైంది. టంగుటూరు నుంచి వచ్చిన ఫైర్ ఇంజిన్ మంటలు ఆర్పి వేసింది. ఈ ప్రమాదంలో పసుమర్తి కోటేశ్వరరావు రూ.లక్ష నష్టం వాటిల్లింది.

కానిస్టేబుల్‌కు సన్మానం

ప్రజాశక్తి - కర్లపాలెం

కర్లపాలెం పోలిస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గోనిబోయిన గోపి కృష్ణ సాధారణ బదిలీలో భాగంగా కర్లపాలెం పోలీస్ స్టేషన్ నుంచి బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీందర్, సిబ్బంది శాలువాతో సన్మానించారు.

అధిక ధరలను నియంత్రించాలి

- బ్లాక్ మార్కెట్‌లో డిఎపి, యూరియా విక్రయాలు
- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-ఇంకొల్లు

రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని ఎరువుల దుణాదారులు యూరియా, డిఎపిని అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామ కోటేశ్వరరావు తెలిపారు. రైతు సంఘం మండల సర్వసభ్య సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో బాచిన హనుమంతరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ యూరియా, డిఎపి బస్తాలపై రూ.80 నుంచి రూ.100 అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత రైతులకు యూరియా ఎక్కువ అవసరమన్నారు. ఈ నేపథ్యంలో సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించాలన్నారు. ఎరువులు బ్లాక్‌లో అమ్ముతున్న విషయం గురించి గతంలో రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జాయిన్ కలెక్టర్ ప్రకార్ జైన్ వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి బ్లాక్‌లో ఎరువుల విక్రయాలను అరికట్టాలని సూచించినట్లు తెలిపారు. ఎరువులు మరియు రైతుల సమస్యలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించినట్లు తెలిపారు. సహకార సంఘాలు, రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు అందజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. జేసీ ఆదేశాల మేరకు రెండు సార్లు సొసైటీలు, ఆర్‌బికెల ద్వారా ఎంఆర్‌పి ధరలకే యూరియా, డిఎపి రైతులు సరఫరా చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారులు వివిధ రకాల సాకులు చెప్పి సొసైటీలు, ఆర్‌బికెల ద్వారా ఎరువులు సరఫరా చేయడం లేదన్నారు. దీంతో రైతులు అధిక ధరకు వ్యాపారుల వద్ద ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించిన సొసైటీలు, రైతు సేవ కేంద్రాల ద్వారా యూరియా, డిఎపి అందించాలని కోరారు. భూ సమస్యల పరిష్కారాన్ని తాత్కాలికంగా కాకుండా ఓ ప్రణాళిక ప్రకారం చేపట్టాలని కోరారు. రైతు సంఘం కార్యదర్శి జిల్లా తల్లపనేని రామారావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు నిర్వహించినప్పటికీ సమస్యలపై అధికారులు ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. గత ప్రభుత్వం సర్వే పేరుతో చేసిన రెవెన్యూ తప్పులుకు అధికారులే బాధ్యులు అని తెలిపారు. భూ సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో వాటి పరిష్కారం కోసం రైతులు వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దష్టికి వచ్చిందన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న మండల కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎన్. సింగయ్య, నాయకులు మాదాల అంజయ్య, బాచిన హనుమంతరావు, గోవింద్ రెడ్డి, శ్రీను హరిబాబు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కందిమళ్ల రామకోటేశ్వరరావు

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి - పంగులూరు


పవన్ గోపికృష్ణ

ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థుల విభాగంలో మండలపరిధిలోని కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చాతరాజు పల్లి పవన్ గోపికష్ణ ద్వితీయ స్థానం సాధించినట్లు బాపట్ల జిల్లా సైన్స్ అధికారి సాదిక్ మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. ఈనెల 30న విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలలో పాల్గొనే పవన్ గోపికృష్ణ అర్హత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పవన్ గోపికష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గోలి సంధ్యారాణి, వైస్ చైర్మన్ రావు వెంకట నరసింహారావు ,గ్రామ పెద్దలు చింతల సహదేవుడు , దాత బొప్పుడి నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - బల్లికురవ

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కుసుమకుమారి మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు, గ్రామస్తులు కృషి చేయాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను స్వచ్ఛందంగా బాగు చేసుకునే కార్యక్రమాలలో అందరూ పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గిరి నాయక్, ఎంఆర్‌సి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చునని ఎంపిడిఒ ఎన్.నాగలక్ష్మి తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ వారోత్సవాలు ముగింపు సందర్భంగా నిజాంపట్నంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మరుగుదొడ్ల వినియోగంతోనే పరిసరాల పరిశుభ్రత మెరుగు పడుతుందన్నారు. .ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు, విద్యార్థులు

మానవ హక్కులతో మనిషి మనుగడకు రక్షణ

ప్రజాశక్తి బాపట్ల

మానవ హక్కుల తోనే ప్రజల మనుగడకు రక్షణ అని బాపట్ల ఆహార శాస్త్ర విజ్ఞాన కళాశాల అసోసియేటెడ్ డీన్ ఎం. సర్దార్ బేగ్ తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ మానవులకు భద్రత, స్వేచ్ఛ, గౌవర వాన్ని మానవ హక్కులు కల్పిస్తాయన్నారు. కుల,మత, లింగ, వర్గ,వర్ణ, వైకల్య వివక్షలకు గురి కాకుండా మానవు లందరికీ రక్షణ కల్పిస్తాయన్నారు. దోపిడీ, నిర్భందాల నుంచి మానవ హక్కులు రక్షణ కల్పిస్తాయన్నారు. మానవహక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే మానవ హక్కుల కమీషన్ ఆశ్రయించవచ్చని ఆయన తెలిపారు. అనంతరం మానవ హక్కుల పైసంక్షిప్త సమా చారాన్ని తెలియజేసే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రంలో ఫోరం కార్యదర్శి సాయి బాబు, అధ్యాపకులు సోమశేఖర రావు, గౌతమి, వినోద తదితరులు పాల్గొన్నారు.

దేవాంగపురిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - చీరాల



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

అపోలో హాస్పిటల్ చీరాల మరియు కృతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని దేవాంగపూరి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ అపోలో హాస్పిటల్ అతి తక్కువ ధరలతో, ముఖ్యంగా నిరుపేదలకు మరియు పేదలకు సేవ చేయడానికి కట్టుబడి ఉందన్నారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని విజయవంతం చేయడంలో మద్దతు మరియు సహకారం అందించినందుకు కతి ఫౌండేషన్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియ చేశారు. వైద్యశిబిరంలో డాక్టర్ కావ్యారెడ్డి (గైనకాలజీ), డాక్టర్ లత శ్రీ (పీడియాట్రిక్స్), డాక్టర్ రంగనాథ్ (ఆర్థోపెడిక్స్), డాక్టర్ గోపి వర్మ (జనరల్ మెడిసిన్), అపోలో హాస్పిటల్ చీరాల నిపుణుల బందం వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, ఇసిజి మరియు షుగర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 250 మంది వైద్యపరీక్షలు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్ చీరాల జనరల్ మేనేజర్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించిన అపోలో హాస్పిటల్ చీరాల అధునాతన మౌలిక సదుపాయాలతో పాటు 24/7 క్రిటికల్ కేర్ మరియు ట్రామా కేర్ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. చీరాల మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇకపై అత్యవసర వైద్య సేవల కోసం గుంటూరు మరియు విజయవాడ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అన్ని రకాల వైద్య సేవలకు ఇప్పుడు చీరాల అపోలో హాస్పిటల్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హామీలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి- పర్చూరు


సిడిపిఒకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సిడిపిఒ జి.సుభద్రకు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ గతేడాది అంగన్‌వాడీలు సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన 42 రోజులు సమ్మెకు సంబంధించి వేతనం ఇవ్వడానికి చంద్రబాబు ప్రభుత్వం అంగీకరించినట్లు తెలిపారు. ఆ ఒప్పందాన్ని అమలు చేసి వేతనాలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని కోరారు. టిఎ బిల్లు, మెనూ ఛార్జీలు పెంచాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొమ్మినేని శ్రీనివాస రావు, బత్తుల హనుమంతరావు ,చినదాసు, అంగన్‌వాడీ యూనియన్ పర్చూరు ప్రాజెక్టు కార్యదర్శి రాణి, శ్యామల ,రమ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

ప్రజాశక్తి- భట్టిప్రోలు


విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మండల పరిధిలోని పెద్దపులివర్రు ఎంపిటిసి, భట్టిప్రోలు ఎంపిపి దావూరి వెంకట లలిత కుమారి మల్లేశ్వరరావు కుమార్తె దావూరి ఆర్గనెస్ తెరిస్సా ఎస్ఐటిలో సీటు సాధించింది. ఈ సందర్భంగా స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో మంగళవారం అభినందన నిర్వహించారు. ఆర్గనెస్ తెరిస్సా ఒకటవ తరగతి నుంచి 5 వరకూ విశ్వశాంతి స్కూల్‌లో చదివింది. నవోదయాలో సీటు సాధించి 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివింది. అనంతరం జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో 99.85 శాతం మార్కులు సాధించి వరంగల్‌లో ఎన్ఐటిలో సీటు సాధించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తనిఖీల వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు నగరంలో విద్యుత్ విజిలెన్సు అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆపరేషన్ ఇఇ ఎం.హరిబాబు, డిపిఇ ఇఇ టి.హైమావతి నేతత్వంలో మొత్తం విద్యుత్ సిబ్బంది 34 బందాలుగా విడిపోయి..తనిఖీలు చేపట్టారు. నగరంలోని కమ్మపాలెం, గోపాల్ నగర్, ఇస్లాంపేట, గుంటూరు రోడ్డు, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, క్లౌపేట, క్రిస్టియన్‌పాలెం ప్రాంతాలలో విస్తత తనిఖీలు చేశారు. విద్యుత్ చౌర్యం, అధిక లోడ్ వినియోగిస్తున్న 363 మందిపై కేసులు కట్టి రూ.17.01 లక్షల అపరాధ రుసుం విధించారు. తనిఖీలలో డి.ఈ.ఈ.లు పాండురంగారావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఏఈ టి.సంతోష్‌కుమార్, ఇతర ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొలుకులకు రానున్న వైద్య శాఖ మంత్రి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల గ్రామంలో శ్రీ హరిహర సేవా సమితి చారిట్రబుల్ ట్రస్టు శంకుస్థాపన మహోత్సవానికి ఈ నెల 11న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ హాజరుకానున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో తహశీల్దార్ తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం తహశీల్దార్ ఏ.బాలకిషోర్ తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. రోగులకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశిల్దార్ నలగాటి మల్లికార్జున నాయుడు, సర్పంచ్‌లు బోడా శ్రీశైలపతి నాయుడు, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ చెవుల అంజయ్య, విఆర్వోలు నాసర్‌వలి, సత్యనారాయణ, ఓబయ్య, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలలో పరిశీలిస్తున్న తహశీల్దార్

పంటల బీమాతో రైతులకు ధీమా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని గంగపాలెం, నరసాయపాలెం గ్రామాలలోని గ్రామ రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సాగులో ఉన్న కంది, మినుము, మిరప పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కెవి శేషారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ఎల్ మాల్యాద్రి రెడ్డి, డి ధనేశ్వరనాయక్, విఏఏలు నాగేంద్ర కుమార్, మంత్రు నాయక్, రైతులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: మండలంలోని కవలకుంట్ల, రాచకొండ గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో గోపికృష్ణ, విఏఏ మస్తాన్, విహెచ్ఏ హనుమంతు నాయక్, రైతులు పాల్గొన్నారు.

నేడు మెడిక్యూర్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్, ఆర్థోపెడిక్ డాక్టర్ కే.శ్రీధర్‌బాబు, పి.శ్రీనాథ్ ఆధ్వర్యంలో మెడిక్యూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను బుధవారం ప్రారంభిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. ఈ హాస్పిటల్ నందు ముఖ్యంగా గుండె వైద్య విభాగం, ఎముకలు కీళ్ల విభాగం, గైనకాలజీ విభాగం, చిన్నపిల్లల విభాగం, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పల్మనాలజీ విభాగాల వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. అందరికీ అతి తక్కువ ఖర్చుతో ఇక్కడ వైద్య సదుపాయాలు కల్పించి రోగులకు భరోసా ఇవ్వబడుతుందని కార్డియాలజీ డాక్టర్ కె శ్రీధర్‌బాబు తెలిపారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల నందు మంగళవారం సోషల్ సైన్సెస్ మరియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పి ప్రదీప్, అధ్యక్షతన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణవేణి స్కూల్‌లో..

పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నందు హ్యూమన్ రైట్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్కూల్ చైర్మన్ రాజు సంగని మాట్లాడారు. కార్యక్రమంలో బ్రాంచ్ డెవలప్‌మెంట్ మేనేజర్ రామకృష్ణ, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీధర్ గుప్త, ఇంచార్జి డైరెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

నిర్బంధాల నుంచి చట్టసభల వరకు..

కనిగిరి ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర

ప్రజాశక్తి-పిసిపల్లి

కనిగిరి ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు విశేషమైన చరిత్ర ఉంది. కనిగిరి ప్రాంతం నుంచి ఎందరో నాయకులు కమ్యూనిస్టు పోరాట యోధులుగా ప్రజల కోసం కడ వరకూ పోరాడారు. ఎన్నో నిర్బంధాల మధ్య ప్రజాపోరాటాలు నిర్వహించారు. కమ్యూనిస్టుల త్యాగనిరతిని గుర్తించిన ప్రజలు వారిని చట్టసభలకు పంపారు.

పీసీపల్లి మండలంలోని నేరేడుపల్లికి చెందిన కామ్రేడ్ గుజ్జుల ఎల్లమందరెడ్డి ఒంగోలు ఏబియం హైస్కూల్లో చదువుతూ విద్యార్థి ఫెడరేషన్ కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. కామ్రేడ్ ఎల్లమందరెడ్డి కనిగిరి ప్రాంత విద్యార్థులతో సత్సంబంధాలు పెట్టుకున్నారు. నాడు విద్యార్థి ఫెడరేషన్ కనిగిరిలో బలంగా ఉండేది. 1945లో నెల్లూరు జిల్లా విద్యార్థి ఫెడరేషన్ మహాసభ 500 మందితో కనిగిరిలో జరిగింది. 1945 సంవత్సరంలో కనిగిరిలో మొదట కమ్యూనిస్టు పార్టీ శాఖ ఏర్పడింది. శాఖ కార్యదర్శిగా కామ్రేడ్ గుజ్జుల ఎలమందారెడ్డి కాగా సూరా పాపిరెడ్డి సభ్యుడు.

నాగార్జునసాగర్ కోసం కృషి

వెనకబడ్డ కనిగిరి ప్రాంతంలో శాశ్వత సాగునీటి సౌకర్యం కోసం నందికొండ నాగార్జునసాగర్ ద్వారా కాలువలు నిర్మించాలని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పోరాటం నిర్వహించారు. 'పొలికేక వేయరా రైతన్న', 'పోరుబాటలో నడవరా మాయన్న' అంటూ రైతు ఉద్యమ నేత గుజ్జుల ఎలమందరెడ్డి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సూరా పాపిరెడ్డి కనిగిరి ప్రాంతమంతా పర్యటించి జనాలను సమీకరించారు. పోరాటాల ఫలితంగా ప్రభుత్వం కష్ణానది నుండి 276 మైళ్ల కాలువలు తవ్వి పెన్నా నదిలో కలపాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రల పన్ని నాగార్జునసాగర్ ప్రాజెక్టును నిర్మాణాన్ని రెండు దశలుగా విడగొట్టింది. మొదటి దశలో దరిశి ప్రాంతం చేర్చారు. మార్కాపురం, పొదిలి, కనిగిరి, కందుకూరు, ఉదయగిరిలను రెండో దశలో చేర్చేందుకు అంగీకరించారు. మొదటి దశ పూర్తయి దర్శి వరకు నీళ్లు వచ్చాయి. ఈ విధంగా కనిగిరి ప్రాంతం సాగునీటికి, తాగునీటికి నాటి నుండి నేటి వరకు వెనుకబడిపోయింది.

పోలీస్ కాల్పుల్లో అమరుడైన కామ్రేడ్ కాకుమాను

1934-42 మధ్య బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టులపై నిషేధం విధించింది. అప్పట్లో అనేకమంది కార్యకర్తలను అరెస్ట్ చేశారు. తీవ్ర నిర్బంధం మోపారు. 1945లో ప్రారంభమైన వెంకటగిరి జమీందారు విధాన రద్దు సాధన ఉద్యమంలో రహస్య జీవితం గడుపుతున్న నాయకుల ఆచూకీ తెలపమని కార్యకర్తలను చిత్రహింసలు పెట్టారు. గ్రామ రక్షక దళాల పేరుతో కమ్యూనిస్టు వ్యతిరేకులు అందర్నీ ఐక్యం చేసి, కమ్యూనిస్టు కార్యకర్తలు, సానుభూతిపరులపై వేట సాగింది. ఇదే సందర్భంలో ప్రజా కంటకుడైన పీసీపల్లి మండలం పోతవరం మునుసుబు కొండారెడ్డి హత్యకు గురయ్యారు. దీంతో మలబారు పోలీసులు పీసీ పల్లి ప్రాంతమంతా దాడులు సాగించారు. పార్టీ వ్యతిరేకులు ఇచ్చిన సమాచారంతో ఉదయగిరి ప్రాంతంలో జంగాలపల్లిలో తలదాచుకుంటున్న కాకుమాను వెంకటేశ్వర్లును 1957 సెప్టెంబర్ 19న అరెస్టు చేసి చిత్రహింసలు గురి చేసి 20న నేరేడుపల్లిలో పోలీసులు కాల్చి చంపారు. కామ్రేడ్ సూరా పాపిరెడ్డి, కామ్రేడ్ సానికొమ్ము పోలిరెడ్డిని అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టి, 11 రోజులు రిమాండ్‌కు పంపారు. 1952-60 మధ్య సాగిన నందికొండ నాగార్జునసాగర్ సాధన ఉద్యమం అనేక నిర్బంధాలను ఎదుర్కొంది.





సూరా పాపిరెడ్డి (ఫైల్)

చట్టసభలకు ఎన్నికైన ప్రజానేతలు

దశాబ్దాలుగా సాగించిన ప్రజా పోరాటాల వలన ప్రజలు కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలబడ్డారు. 1952, 1955 ఎన్నికల్లో కామ్రేడ్ గుజ్జుల ఎలమందరెడ్డి, 1962లో కామ్రేడ్ కోటపాటి గురుస్వామిరెడ్డి, 1972లో కామ్రేడ్ సూరా పాపిరెడ్డిని ఎమ్మెల్యేలుగా గెలిపించారు. 1962లో మార్కాపురం పార్లమెంటు సభ్యులుగా కామ్రేడ్ గుజ్జుల ఎలమందారెడ్డి ఎన్నికయ్యారు. 1981లో కనిగిరి సమితి అధ్యక్షులుగా కామ్రేడ్ ఇరిగిన తిరుపతి నాయుడు గెలిచారు.

కమ్యూనిస్టు పార్టీ చీలిక

1964లో కమ్యూనిస్టు పార్టీలో చీలిక వచ్చింది. చీలిక సమయంలో సిపిఎం వైపు కామ్రేడ్ సూరా పాపిరెడ్డి కామ్రేడ్ చాగంరెడ్డి నరసింహారెడ్డి, బాలు ఓబుల్‌రెడ్డి, కొండ్రెడ్డి ఓబుల్ రెడ్డి, సానికొమ్ము పోలిరెడ్డి, మాలపాటి కోటిరెడ్డి, మూలే వెంకటస్వామిరెడ్డి, కందుల తిరుపతిరెడ్డి, పిల్లి అల్లూరయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్కే నబీసాహెబ్, మండ్ల వెంకటస్వామి, మండ్ల వెంకటేశ్వర్లు, అమడసాని పుల్లారెడ్డి, దమ్ము జయరావ్ ఇ.తిరుపతినాయుడు వచ్చారు. కామ్రేడ్ సూరా పాపిరెడ్డి ఉత్తర నెల్లూరు జిల్లా కార్యదర్శిగా కామ్రేడ్ చాగం రెడ్డి నరసింహారెడ్డి, కనిగిరి తాలూకా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1968లో మళ్లీ ఏర్పడిన చీలికలో కామ్రేడ్ పప్పు వెంకోబురావు మినహా అందరూ తరిమెల నాగిరెడ్డి వైపు వెళ్ళారు. కొద్దిరోజులు అనంతరం కామ్రేడ్ సూరా పాపిరెడ్డి తిరిగి సిపిఎం రాజకీయాల వైపు మొగ్గు చూపారు. పార్టీ సభ్యత్వం తీసుకోకపోయినా సిపిఎంలో పనిచేశారు. 1972లో కామ్రేడ్ సూరా పాపిరెడ్డి కనిగిరి నియోజకవర్గం నుండి సిపిఎం మద్దతుతో శాసనసభ్యులుగా గెలిచారు. 1978లో మే రెండో తేదీన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య సమక్షంలో 1000 మందితో కనిగిరిలో మధ్య జనరల్ బాడీ సమావేశం జరిపారు. అనంతరం కామ్రేడ్ సూరా పాపిరెడ్డి పార్టీ కన్వీనర్ గా కామ్రేడ్ సానికొమ్ము పోలిరెడ్డి, కందుల తిరుపతిరెడ్డి, మాలపాటి కోటిరెడ్డి, బాలు ఓబులరెడ్డి, పప్పు వెంకోబురావు, ఎస్.కె నబీసాహెబ్, మండ్ల వెంకటేశ్వర్లు ఇరిగినేని తిరుపతినాయుడు కమిటీ సభ్యులుగా వున్నారు. అదే సమయంలో నెల్లూరులో విద్యార్థులుగా ఉన్న వి.మాలకొండారెడ్డి, సూరసాని అచ్చిరెడ్డి అక్కడ విద్యార్థి సంఘంలో పనిచేస్తూ చదువులు ముగించుకొని కనిగిరి వచ్చారు. వీరందరూ కలిసి తిరిగి 1978లో సిపిఎం శాఖలను ఏర్పాటు చేశారు. కామ్రేడ్ సూరా పాపిరెడ్డి కందుకూరు రెవిన్యూ డివిజన్ పార్టీ కార్యదర్శిగా పనిచేశారు.

ఎంఎల్ఏగా కామ్రేడ్ సూరా పాపిరెడ్డి సేవలు

1972 -72 కాలంలో సిపిఎం మద్దతుతో గెలిచిన సూరా పాపిరెడ్డి కనిగిరి ప్రాంత అభివద్ధికి కృషిచేశారు. శాసనసభ్యులుగా, ప్యానెల్ స్పీకర్‌గా, శాసనసభ కమిటీలలో, మరియు జిల్లా అభివద్ధి సంస్థ సభ్యులుగా పని చేశారు. కనిగిరి ఆర్టీసీ డిపో నిర్మాణం పాపిరెడ్డి కషి వల్లే జరిగింది. డీజీ పేట, కొమరోలు రోడ్డు నిర్మాణం ప్రధానమైనవి. 1989-1994 మధ్యకాలంలో సిపిఎం సానుభూతిపరులు అనేకమందిపై అక్రమంగా నక్సలైట్లు అని ముద్ర వేసి కేసులు బనాయించారు. వీరందరికీ కామ్రేడ్ సూరాపాపిరెడ్డి దగ్గర ఉండి వ్యక్తిగత హామీ ఇచ్చి.. ఆ కేసుల నుంచి విడిపించారు. ప్రకాశం జిల్లాలోనే మొట్టమొదటగా కనిగిరిలో సిపిఎం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. 1985లో కార్యాలయాన్ని కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చేతుల మీదుగా ప్రారంభించాలని అనుకున్నా.. అనంతరం ఆయన మతి చెందటంతో ఆయన పేరు మీదుగా సుందరయ్య భవనంను కామ్రేడ్ మోటూరు హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభకు 5000 మంది వచ్చారు. 1986లో కనిగిరిలో యువజన సంఘం రాజకీయ పాఠశాల నిర్వహించారు. 1988లో విద్యార్థి రంగ జిల్లా మహాసభ సందర్భంగా కనిగిరిలో 5 వేల మంది భారీ బహిరంగ సభ ర్యాలీ నిర్వహించారు.



శ్రీవారి సన్నిధిలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దంపతులు

శ్రీవారిని దర్శించుకున్న గొట్టిపాటి దంపతులు

ప్రజాశక్తి-దర్శి

తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, యువనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌లు తిరుపతిలోని శ్రీవెంకటేశ్వరస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, లలిత్ సాగర్ దంపతుల వివాహ మహోత్సవం సందర్భంగా తిరుపతి దర్శనానికి వెళ్ళారు. కూటమి ప్రభుత్వంలో దర్శి ప్రజలు అభివృద్ధి చెందాలని, దేవుని ఆశీస్సులతో ప్రజలకు మేలు జరగాలని వేడుకున్నట్లు ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం నిరాటంకంగా జరగాలని, ఎన్ని దుష్టశక్తులు అడ్డుకున్న ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని, దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు.



గృహాలు పరిశీలిస్తున్న పిడి పి శ్రీనివాసప్రసాద్

గృహాల పరిశీలన

ప్రజాశక్తి-దర్శి

మధ్యలో ఆగిపోయిన గ్రహాలన్నీ ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి శ్రీనివాస ప్రసాద్ అన్నారు. మండలంలోని వెంకటాచలం పల్లి లేఔట్‌లోని గృహాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఎల్ఎల్, ఆర్ఎల్, ఆర్‌సి స్టేజిలలో ఉన్న అన్ని గృహాలను డిసెంబర్ నెల ఆఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన గృహాలను మార్చి 2025 లోపు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట హౌసింగ్ డిఇఇ డి నిరీక్షణరావు, ఎఇ షేక్ సాకీర్‌బాషా, వర్క్ఇన్‌స్పెక్టర్ టి కొండలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ థియోఫిలాస్ పాల్గొన్నారు.

12న వైసిపి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్



వైసిపి కన్వీనర్ వెంకటయ్య

ఈనెల 12న కనిగిరిలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వైసిపి మండల కన్వీనర్ భువనగిరి వెంకటయ్య కోరారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. కనిగిరి పవిత్ర కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ఇంచార్జి దద్దాల నారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వైసిపి జిల్లా పరిశీలకులు, ఒంగోలు పార్లమెంటు వైసిపి ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఇతర నాయకులు హాజరవుతారని తెలిపారు. మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ధాన్యం కొనుగోలులో దగా చేస్తే చర్యలు

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

ప్రజాశక్తి-దర్శి

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వాలని తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్పష్టం చేశారు. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులను దగా చేస్తే సంబంధిత వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకుంటారని అన్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల రైతులు ధాన్యం అమ్మకాలు జరపాలని కోరారు. ఈపాటికే నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు టొబాకో బోర్డు ద్వారా లంకోజనపల్లిలో నాలుగు కొనుగోలు



ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలో మరికొన్ని ఏజెన్సీల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నియోజక వర్గంలో ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా, జెసి ఆర్ గోపాలకృష్ణ హామీ ఇచ్చినట్లు వివరించారు. ఏజెన్సీల ద్వారా రైతు భరోసా కేంద్రాలు, కోపరేటివ్ సొసైటీలలో త్వరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ మేరకు ధాన్యం కొనుగోలుపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మార్కెటింగ్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. వ్యాపారులు రైతులను దగా చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. వ్యాపారుల వలలో రైతులు పడి ఇబ్బందులు పడవద్దని విజ్ఞప్తి చేశారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నియోజకవర్గంలో ప్రతి గింజ కొనాలని కోరారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు

ప్రజాశక్తి-తాళ్ళూరు

పొగాకుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి జె ప్రసాదరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దిగుబడుల విషయంలో గానీ, పంట ఉత్పత్తుల ధరల విషయంలో గానీ ఆశాజనకంగా గాను, అనువుగాను రబీలో సాగుకు అనుకూలంగా ఉండే పొగాకు బదులుగా మొక్క జొన్న పంటలను సాగు చేయాలని అన్నారు. మండలంలోని తాళ్ళూరు, కొత్తపలెం రైతులచే మొక్క జొన్న సాముహిక ప్రదర్శన క్షేత్రంను క్షేత్ర పర్యటన చేసి రైతులకు రబిలో అనుకూలమైన మొక్కజొన్న రకాలు, అందుకు వాడాల్సిన ఎరువులు, పురుగు మందులు, నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో విఎఎ నాగరాజునాయక్ పాల్గొన్నారు.



పంటల సాగు గురించి వివరిస్తున్న ఎఒ జె ప్రసాదరావు

దర్శి : రైతు సేవ కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి వి బాలకృష్ణనాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతు సేవ కేంద్రాల్లో రైతులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పొలాల సందర్శించారు. ప్రస్తుతం వరి పంట కోతలు జరుగుతున్న తరుణంలో రైతులు ధాన్యాన్ని జాగ్రత్తగా వర్షల బారి నుండి కాపాడుకోవాలని చెప్పారు. టార్పాలిన్ పట్టలను సేకరించి ఉంచుకోవాలని, వాతావరణా మార్పులకు తగ్గట్లు పంట కోతలు నిర్వహించుకోవాలని, కోసిన పంట కుప్పలపై 25 కేజీల ఉప్పు పిచికారి చేసుకోవాలని తెలిపారు. ధాన్యానికి సంబంధించి వద్ద కొనుగోలు కేంద్రంలో రైతులు తమ ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు అమ్ముకోవచ్చునన్నారు. పంట నమోదు, క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఎపిఎంఐపి నుండి డ్రిప్ ఇరిగేషన్‌కి సంబంధించి రైతులకు అవగాహన కల్పించారు. సబ్సిడీ కింద రైతులు రిజిస్ట్రేషన్ చేసుకొని డ్రిప్పు పొందవచ్చున్నారు. కార్యక్రమాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు జి సౌమ్య, కంత అరుణ పాల్గొన్నారు.



పొలం పిలుస్తుందని కార్యక్రమంలో దర్శి ఎఒ బాలకృష్ణ

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఆవుల సురేష్ అన్నారు. భూ సమస్యలతో పాటుగా ఇతర సమస్యలను పరిష్కరించు కునేందుకు ప్రజలు కార్యాలయాలు చుట్టు తిరిగి సమయాన్ని వృధా చేసుకోకుండా మీ గ్రామాలకే అధికారులు వచ్చి సమస్యలను అడిగి పరిష్కరించేందుకు ఇది మంచి అవకాశం అన్నారు. మండల కేంద్రంలోని సచి వాలయం ఆవరణలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి అర్జీని కంప్యూటర్‌లో నమోదు చేసి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించ నున్నట్లు తెలిపారు. సర్వే నెం.56లో రెండేళ్లుగా వివాదస్పదమైన దారి సమస్యకు సంబంధించిన భూమిని పరిశీలించారు. ఆ భూమిలో ఫైర్లు ఉన్నందున పూర్తయిన వెంటనే దారి సమస్య పరిష్కరిస్తారని దరఖాస్తుదారులకు హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీ వాసులకు



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళ

సంబంధించిన స్మశానం స్థలం ఆక్రమణకు గురైందని కాలనీ వాసులు ఫిర్యాదు చేయగా ఆ స్థలాన్ని అధికారుల బృందం పరిశీలించారు. భూ సమస్యలు, కొత్త రేషన్ కార్డులు, ఇంటి నివేశన స్థలాల పట్టాల కోసం దరఖాస్తులను సదస్సులో అందజేశారు. తహశీల్దార్ ఎస్‌సి కాలనీల వీధులలో తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 22 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆర్ఐ మహాదేవరెడ్డి, మండల సర్వేయర్ రాజశేఖర్, విఆర్‌ఓలు శ్రీనివాసరెడ్డి, వి సుబ్బారెడ్డి, సచివాలయం సర్వేయర్ శివశంకర్‌రెడ్డి, టిడిపి గ్రామ అధ్యక్షులు వేంపాటి శ్రీకాంత్‌రెడ్డి, కంప్యూటర్ సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ఫైనల్‌కు చేరిన జట్లు

ప్రజాశక్తి - సంతనూతలపాడు

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో గత 4రోజుల నుండి రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పురుషుల విభాగంలో ప్రకాశం – తూర్పుగోదావరి జిల్లా జట్లు, మహిళల విభాగంలో విజయనగరం – కృష్ణా జిల్లాల జట్లు ఫైనల్‌కు చేరాయి. ఈ జంట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ లు ఆద్యంతం ఉత్కంట భరితంగా సాగుతున్నాయి. సూధనగుంట కోటయ్య చౌదరి ఆదిలక్ష్మి మెమోరియల్, జిల్లా కబడి అసోసియేషన్ ఆధ్వర్యంలో 71వ రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు సూధనగుంట ఫౌండేషన్ వ్యవస్థాపకులు సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, సూదనగుంట కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈనెల 7న పోటీలు ప్రారంభమై మంగళవారం ముగిశాయి. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడి అసోసియేషన్ అధ్యక్షుడు జి వెంకటరెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వై శ్రీకాంత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ అర్జునరావు, ట్రెజరర్ కె సుబ్బరాజు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, హైదరాబాద్ డిఎస్ పి అన్ను వేణుగోపాల్ హాజరయ్యారు. టోర్నమెంట్ ఆర్గనైజర్లు మందాడి వెంకటేశ్వర్లు, సూదనగుంట వేణుబాబు, పి నారాయణస్వామి చౌదరి, ముప్పరాజు శ్రీనివాసరావు, బి శంకర్ పర్యవేక్షించారు.

విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పామూరు

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గేవరకు ప్రజలను చైతన్యపర్చి రాబోయే రోజుల్లో ఆందోళనలు చేపడతామని సిపిఐ జిల్లా నాయకులు సయ్యద్ మౌలాలి హెచ్చరించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన చీకటి ఒప్పందాలను రద్దుచేసి, అదాని అవినీతి కుంభకోణంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన హింసాత్మక పరిస్థితులపై పార్లమెంట్లో చర్చ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పేదవాడు బ్రతికేందుకు వీలు లేకుండా నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశం అంటుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తూ ఉన్నాయని అన్నారు. తక్షణమే అధిక ధరలు నియంత్రించాలని కోరారు. ఎంతోమంది ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెంచిన కరెంటు చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అజయ్ కుమార్‌కు అందజేశారు.




ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి -పంగులూరు


రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకొని రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహశీల్దారు సింగారావు తెలిపారు. మండల పరిధిలోని ముప్పవరం, జాగర్లమూడి వారి పాలెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ గ్రామాల్లో అనేక సంవత్సరాలుగా భూ సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయని, వాటిని పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు చక్కని వేదికలని తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్, మైనింగ్ ఏడీ రాజేష్ కుమార్ మాట్లాడుతూ భూ సమస్యల కారణంగా అనే గొడవలు జరుగుతుంటాయన్నారు. వాటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముప్పవరం గ్రామంలో ఎఫ్‌లైన్ సమస్యలు మూడు, ఆర్ఒఆర్ సమస్యలు 20 వచ్చాయి. వాటిలో డిజిటల్ సిగ్నేచర్ 4, రీప్లేస్మెంట్ రెండిటిని అక్కడికక్కడే పరిష్కరించారు. వన్‌బిలు , ప్రింట్లు అందజేశారు. జాగర్లమూడి వారిపాలెంలో ఎఫ్ లైన్ 6, ముటేషన్లపై 7 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాబయ్య, సర్వేయర్ సురేష్ బాబు,విఆర్ఒలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పంగులూరులో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దారు

చిన్నగంజాం : మండల పరిధిలోని కొత్తపాలెం పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 21 అర్జీలు వచ్చినట్లు తహశీల్దారు ప్రభాకర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డిఎల్‌పిఒ పద్మావతి , ఎంపిడిఒ, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి ఎం. రమేష్ బాబు తెలిపారు. మండల పరిదిలోని అడవి పాలెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి రైతు తమ సమస్యలను అర్జీ రూపంలో తెలియజేస్తే నిర్ణీత సమయంలో అధికారులు పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దిండు హనుమంతరావు, తహశీల్దారు కె. రవిబాబు, డిటీ రాఘవరావు, సుబ్బారెడ్డి,విఆర్ఒ సయ్యద్ కరీం, నాయకులు వెంకటరావు, కామా శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



సంతమాగులూరులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కొల్లూరు : మండల కేంద్రమైన కొల్లూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు భూసమస్యలపై 8 అర్జీలు అంజదేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె. రామ బాలాజీ రెడ్డి , తహశీల్దార్ వెంకటేశ్వర్లు , టిడిపి మండల అధ్యక్షుడు మైనేని మురళీకష్ణ, డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసరావు ,సర్వేయర్ హర్షవర్ధన్, రైతులు,అధికారులు పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న అశోక్‌బాబు

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలు మండల పరిధిలోని అద్దేపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు అబ్దుల్ కలాందర్ కుమారుడు అబ్దుల్ ఆగామీర్జా ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. ప్రస్తుతం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. అందులో భాగంగా వైసిపి వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు ఆగామీర్జాను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నాడు. అనంతరం ఇటీవల గుండెఆపరేషన్ చేయించుకున్న తన్నీరు కోటయ్యను అశోక్‌బాబు పరామర్శించారు. కోటయ్య ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కుందేటి రమేష్, కౌతరపు శ్రీనివాసరావు, పడమటి శ్రీనివాసరావు, సిరాజుద్దీన్, జోషికాంత్, యల్లమంద పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇశ్రాయేలు

ప్రతి మనిషి స్వేచ్ఛగా జీవించాలి

ప్రజాశక్తి - పంగులూరు

ప్రతి మనిషి స్వేచ్ఛగా, సంతోషంగా జీవించాలని మానవ హక్కుల సంఘం ఉపాధ్యక్షుడు ఇశ్రాయేలు తెలిపారు. ఎదుటివారి హక్కులకు భంగం కలగకుండా చూడాలన్నారు. మండల పరిధిలోని బైటమంజులూరు గ్రామంలో పపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇశ్రాయేలు మాట్లాడుతూ ప్రతి మనిషికి జీవించే హక్కు ఉందన్నారు. స్వేచ్ఛగా శాంతియుతంగా ప్రపంచంలో బతికే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు భానుచందర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- భట్టిప్రోలు

టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో టిడిపి మండల స్థాయి కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల వారీగా నాయకుల తీసుకున్న టార్గెట్లను పూర్తి చేయడంలో వెనుకపడినట్లు తెలిపారు. లక్ష్యాన్ని ఛేదించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివద్ధి సంక్షేమ దిశగా ముందుకు వెళుతుందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడి రాష్ట్రాన్ని అభివద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, మండల అధ్యక్షుడు వాక శేషుబాబు, బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భట్టు మల్లికార్జునరావు, నాయకులు వేములపల్లి జగన్నాధరావు, మోటూరు పుణ్య శ్రీనివాసరావు, రాయన ప్రసాద్‌రావు, వామనపల్లి కోటేశ్వరరావు, మాచర్ల నాగరా, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సుస్థిరాభివృద్ధితో జీవన ప్రమాణాలు మెరుగు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - రేపల్లె

సుస్థిరాభివద్ధితోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని ఎంపిడిఒ ఎం.శోభారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సుస్థిరాభివద్ధి లక్ష్యాలపై నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మొత్తం 247 మందికి నాలుగు బ్యాచ్‌లుగా రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలకు మెరుగుపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సుస్థిరాభివద్ధి లక్ష్యాల ప్రాధాన్యతను క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లడంలో మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లు కషి చేయాలన్నారు. ఈనెల 10 నుంచి 19 వరకు మండల స్థాయిలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ శోభారాని

బాపట్ల : సహజ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పులిశరత్ బాబు తెలిపారు. గ్రామాల అభివద్ధికి పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. సుస్థిరాభివద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచులు, కార్యదర్శులకు ఈనెల 10 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ నిధులతో, రాష్ట్ర గ్రామీణాభివద్ధి పంచాయతీ రాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో పది రోజులు పాటు అధికారులకు ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3 బ్యాచ్ లుగా మొత్తం 236 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చిన్నపోతుల హరిబాబు, విస్తరణ శిక్షణా కేంద్రం జిల్లా లింకు అధికారి విజయ, సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరం

ప్రజాశక్తి - నిజాంపట్నం : మండల పరిధిలోని కళ్లిఫలం గ్రామంలో బాపట్ల శ్రీసత్య సాయి సేవా సమితి, గ్రామ సేవా విభాగం వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. విశ్రాంత ఏడీ డాక్టర్ పున్నయ్య శాస్త్రి తన సొంత నిధులతో ఉచితంగా మందులు అందజేశారు. కూచినపూడి పశువైద్యాధికారి డాక్టర్ హేమప్రియ, పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 144 పశువులకు, 200 కోళ్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 100 దూడలకు మందులు, 56 గేదెలకు గర్భకోశ నివారణ మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణు గోపాల్‌సమితి ప్రతినిదులు శ్రీనివాసరావు, కామేశ్వరరావు, సుధారాణి, సుబ్బారావు, రత్నాలు, ఆంజనేయులు, పాలసేకరణ కేంద్రం సిబ్బంది సాంబశివరావు, దాసరి వెంకటేశ్వరరావు, నాంచారయ్య, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ప్రజాశక్తి- బల్లికురవ : మండల పరిధిలోని ఉపమాగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏడో తరగతి నుంచి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ సుధ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సమాజంలో కూడా ఇంకా అక్కడక్కడ బాల్యవివాహాలు నిర్వహించడం దురదష్టకరమన్నారు. ఈ సందర్భంగా వీడియో విజువల్స్ ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో టిడిపిఒ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ మీరాబి, సిబ్బంది సురేఖ, అనూష, పుష్పలత పాల్గొన్నారు.

విరాళాలు సేకరణ

ప్రజాశక్తి - రేపల్లె : సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమం కోసం మంగళవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా రేపల్లె అగ్నిమాపక కేంద్రం అధికారి వై.సాంబశివరావు తెలిపారు. యుద్ధంలో వికలాంగులైన సైనికులు, యుద్ధ వితంతవులు, దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమర వీరుల కుటుంబాలు, మాజీ సైనికులు,మాజీ సైనికుల వితంతువుల కుటుంబాల సంక్షేమం కోసం విరాళాలు సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, నాగార్జున, నాగరాజు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-మార్టూరు : కుటుంబ పోషణ భారమై దుర్భర జీవనం గడుపుతున్న ఓ వికలాంగురాలికి హెల్పింగ్ హాండ్స్ సంస్థ ప్రతినిధులు నిత్యా వసర సరుకులు, రూ. 5వేల నగదును మంగళవారం అందజేశారు. మార్టూరులోని తూర్పు బజారు వద్ద నివసిస్తున్న మిరియాల రామసుబ్బులుకు పుట్టుకతోనే పోలియో వ్యాధి సోకింది. దీంతో ఆమె బాల్యం నుంచే మంచానికే పరిమితమై ఉంది. ఇటీవల ఆమె తండ్రి మరణించాడు. వద్ధురాలైన తల్లికి కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ విషయం గురించి తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ సంస్థ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌వలి తమ బందం కలిసి నిత్యావసరాలు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పుట్టా అయ్యప్ప, పుట్టా వెంకటేశ్వర్లు, కాలేషా, జాఫర్, బాషా,జానీ, ఒపిడిఆర్ బాషా పాల్గొన్నారు

వ్యయసాయ ప్రదర్శన

ప్రజాశక్తి ముండ్లమూరు : నేల ఆరోగ్యంగా ఉంటేనే అదిక దిగుబడి వస్తుందని బాపట్ల అగ్రికల్చర్ డీన్ డాక్టర్ ప్రసన్న రాణి తెలిపారు.ముండ్లమూరు గ్రామంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన, గ్రామీణ వ్యవసాయ కషి అనుభవంపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, దర్శి ఎడిఎ బాలాజీ నాయక్, ముండ్లమూరు, దర్శి వ్యవసాయ అధికారులు మహమ్మద్ ఫరూక్, బాలకష్ణ నాయక్,డాక్టర్ మండవ శ్రీనివాసులు, ఎఆర్ ఎస్ ప్రధాన శాస్త్ర వేత్త డాక్టర్ వర ప్రసాద్, డాక్టర్ టివి. రెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎస్ఈ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యుత్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా విద్యుత్ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో యర్రగొండపాలెం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల విద్యుత్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎస్ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అవసరమైన స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉందన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్ కావాల్సిన వారు సూర్య ఘర్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చార్జీల కింద రూ.వెయ్యి ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని చెప్పారు. ఈ పథకానికి ఇంటి మేడపైన వెయ్యి చదరపు అడుగుల స్థలం అవసరమన్నారు. ఈ పథకం కేవలం డిపిఎల్ వినియోగదారులకు మాత్రమే వస్తుందని పేర్కొన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇంకా జిల్లా విద్యుత్ ఎస్ఏవో సుబ్బారావు, మార్కాపురం విద్యుత్ ఈఈ పివి నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం ఏఈలు తలపాటి అల్లూరయ్య, పి కిశోర్, సిహెచ్ సురేష్‌తో పాటు మూడు మండలాల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో

అన్ని రకాల వైద్యసేవలు

ఘనంగా ఉపాస్ హాస్పిటల్ వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న ఉపాస్ డైరెక్టర్లు, వైద్యులు

ప్రజాశక్తి-ఒంగోలు

పేదలకు అందుబాటులో అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నట్లు ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ జి.ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ కాపా అనిల్‌కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు తెలిపారు. ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మూడో వార్షికోత్సవ వేడుకలు హాస్పిటల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ స్థాపించిన మూడు సంవత్సరాల్లో ఉత్తమ వైద్య సర్వీసులను అందించి.. హాస్పిటల్ బ్రాండింగ్ నిలుపుకొన్నామన్నారు. అనేకమంది పేషెంట్లు తమని ఆదరించారని, కార్డియాలజీ, న్యూరాలజీ ఆర్థోపెడిక్, పల్మనాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, గ్యాస్ట్రో, గైనకాలజీ అత్యవసర వైద్యసేవలన్నీ అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీధర్ చివుకుల, పవన్‌కుమార్, సువర్ణ రాజు, పి.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే 'సదస్సులు'

తహశీల్దార్ ఏ.బాలకిషోర్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గ్రామ స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని యర్రగొండపాలెం తహశీల్దార్ ఏ.బాలకిషోర్ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముందుగా మీ భూమి-మీ హక్కు గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశాన్ని చదివి వినిపించారు. ప్రజలకు భూమితో ఉన్న అనుబంధం, భూ సమస్యలు, పరిష్కార మార్గాలను వివరించారు. భూ సమస్యలన్నీ పరిష్కరించేందుకు యర్రగొండపాలెం మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ భూ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని సూచించారు. నిర్దేశించిన సమయంలోనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటి తహశిల్దార్ నలగాటి మల్లికార్జున నాయుడు, సర్పంచ్‌లు బోడా శ్రీశైలపతి నాయుడు, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ చెవుల అంజయ్య, విఆర్వోలు నాసర్‌వలి, సత్యనారాయణ, ఓబయ్య, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల

నిర్మాణ పనులు ప్రారంభించాలి

- డాక్టర్ల బదిలీలను నిలుపుదల చేయాలి

- ప్రభుత్వ సర్వజన వైద్యశాల వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మార్కాపురం సమీపంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేసింది. గత సెప్టెంబర్ నుంచి మెడికల్ కళాశాల నిర్వహించేందుకు గత ప్రభుత్వం సన్నాహాలు చేసింది. అందులో భాగంగా పలు విభాగాలకు చెందిన వైద్యనిపుణులను నియమించింది. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను నిలుపుదల చేసింది. వైద్యులను బదిలీ చేసింది.

ఈ నేపథ్యంలో మార్కాపురం ప్రాంతంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పునఃప్రారంభించాలని, వైద్యుల బదిలీలు నిలుపుదల చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్య మాట్లాడుతూ వెనుకబడిన మార్కాపురం ప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేయటం సిగ్గుచేటన్నారు. కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లను బదిలీ చేయటాన్ని ఆయన వ్యతిరేకించారు. పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత వైద్యం అందని ద్రాక్ష పండులా ఉందని, తీవ్రమైన జబ్బుల బారిన పడిన రోగులు వైద్యం కొరకు వందల కిలోమీటర్ల దూరంలోని కర్నూలు, గుంటూరు, హైదరాబాదు, ఒంగోలు ప్రాంతాలకు వ్యయ, ప్రయాసలకు ఓర్చి వెళుతున్నారన్నారు. అత్యవసర సమయాల్లో ప్రయాణంలో ప్రాణాలు వదులుతున్న దయనీయమైన పరిస్థితి కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిరంతరం వైద్యుల కొరత, మందులు కొరత వలన వైద్యం పేదలకు అందుబాటులో ఉండటం లేదన్నారు. పెద్ద సంఖ్యలో ఉన్న దళితులు, గిరిజనులు, అగ్ర వర్ణాల్లోని పేద ప్రజలకు వైద్యం అందక బతుకు భారంగా నడుస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ఆశగా ఎదురుచూస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం నిర్మాణాన్ని నిలిపివేయటం, డాక్టర్లను బదిలీ చేయటం వంటి చర్యలు మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కాపురంలో నడుస్తున్న జిల్లా ఆసుపత్రి స్థానంలో మెడికల్ కళాశాల సిబ్బంది నియామకంలో భాగంగా పెద్ద సంఖ్యలో డాక్టర్ల నియామకం జరిగిందని, ఫలితంగా జిల్లా ఆసుపత్రి నడుస్తున్న కాలంలో 300గా ఉన్న ఓపి మెడికల్ కళాశాల డాక్టర్లు పెద్ద సంఖ్యలో రావడం వల్ల ఓపి ఒక్కసారిగా 700కు పైగా చేరిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ జపం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ ఆధీనంలో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కళాశాలను నిలుపుదల చేయటం, భవిష్యత్తులో ప్రైవేట్ భాగస్వామ్యంతో కళాశాలను నడుపుతామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత వైద్యం దూరం చేయడమే అవుతుందని, ఇటువంటి చర్యలు ప్రభుత్వం మానుకోవాలని, పేదలకు వైద్యం అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం పద్ధతి మార్చుకోకపోతే కలిసొచ్చే పార్టీలతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డికెఎం రఫీ, నాయకులు పి రూబెన్, జవ్వాజి రాజు, షేక్ నన్నేషా, మహబూబ్ బాషా, ఏనుగుల సురేష్‌కుమార్, కట్టా సుబ్బారావు, జి విక్టర్ పాల్గొన్నారు.

ఒంగోలు నియోజకవర్గ

అభివృద్ధికి నిధులు ఇవ్వండి

సిఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే దామచర్ల భేటీ


సిఎం చంద్రబాబుతో దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కోరారు. మంగళవారం సాయంత్రం సచివాలయం లోని సిఎం కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై సిఎంతో ఎమ్మెల్యే దామచర్ల చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఒంగోలు నగరానికి యువ గళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ హామీ మేరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు చేయాలని కోరారు. అసంపూర్తిగా వున్న తాగునీటి పథకానికి, పోతురాజు కాలువ అభివద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఒంగోలు నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్స్‌లో పనులు చేయకుండా బిల్లులు డ్రా చేసుకున్న విధానాన్ని వారికి వివరించి వాటిపై విజిలెన్స్ విచారణ చేయాలని కోరారు. ఒంగోలు నగరంలో జరుగుతున్న వార్డుకో వారం, ఇంటింటికి సమగ్ర సర్వే వివరాలను సిఎంకు వివరించారు. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. ఒంగోలు నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు చేపడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావును సిఎం అభినందించారు.

100 శాతం కంది పంట కొంటాం..

అధికారులకు జేసీ గోపాలకృష్ణ ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో రైతులు పండించిన కంది పంటను 100 శాతం కొనుగోలు చేస్తామని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక జెసి ఛాంబర్‌లో మంగళవారం పౌర సరఫరాల అధికారులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన కంది పంట కొనుగోలు చేయుటకు మార్క్ ఫెడ్ ను నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. 2024 ఖరీఫ్ - కంది పంట ఉత్పత్తులను నాఫెడ్ ఆధ్వర్యం లో మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేయటానికి నిర్ణయించిందన్నారు. ప్రకాశం జిల్లా లో 70,817 హెక్టార్ లలో 73,091 మంది రైతులు కంది పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్నారన్నారు. 72,391 మెట్రిక్ టన్నుల పంట వస్తుందని అంచనా వేశామన్నారు. 2024 ఖరీఫ్‌లో కంది పంటను ఈ-క్రాప్‌లో నమోదు చే యించుకున్న రైతుల వద్దనుంచి 100 శాతం పంటను కొనుగోలు చేస్తామన్నారు. ఈనెల 12 నుంచి రైతులు వారి రైతు సేవా కేంద్రాలలో విఎఎ, విహెచ్‌ఎ, విఎస్ఎ ల ద్వారా సిమ్యాప్‌లో పంట వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ద్వారా ఎక్కువ లాభపడవచ్చని తెలియజేశారు.జిల్లాలోని కంది పంట సాగుచేసిన రైతులు వారి పేర్లను నమోదు చేసుకొనే సమయంలో పంట నూర్పిడి తేదీని కూడా నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా, తమ సరుకును అమ్ముకొనే తేదీ రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు సందేశం వస్తుందన్నారు. రైతులకు తమ డబ్బులు ఆధార్ తో అనుసంధానం అయిన బ్యాంకు అకౌంట్ లో జమ చేస్తారన్నారు. రైతులు తమ సరుకును అమ్మే సమయంలో తమ మొబైల్ నెంబరు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ కు లింక్ అయిందో లేదో సరి చూసుకోవాలన్నారు. రైతులు తమ పంటను శుభ్రపరుచుకొని, ఆరబెట్టుకొని తేమ శాతం 12 శాతం లోపు ఉండి ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలలో ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెసి కోరారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.